సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 7 । మే । 2023



ఎగిరిపడుతున్న రాళ్లు

కొమురవెల్లి ఆలయ సమీపంలో జరుగుతున్న బ్లాస్టింగ్‌తో నివాసాలపై రాళ్లు వచ్చి పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 8లో



చెల్లి పెళ్లి అప్పు తీర్చేందుకు చోరీ

చెల్లి పెళ్లికి చేసిన అప్పు తీర్చేందుకు ఓ ఇంట్లో చోరీకి పాల్పడి పోలీసులకు దొరికాడు ఓ వ్యక్తి. కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15మందికి నిర్వహించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

39 మందికి పదోన్నతి



బ్యాడ్జీ తొడుగుతున్న ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలోని 39 మంది ఎ.ఆర్. కానిస్టేబుల్స్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తున్నట్లు ఎస్పీ రమణ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు లెక్కచేయకుండా సర్వీస్ చేసి, రిమార్క్ లేకుండా బాధ్యతలు నిర్వర్తించినందుకు గాను ప్రభుత్వం పదోన్నతి కల్పించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఎస్పీ శుభాకాక్షలు తెలిపారు.

కలెక్టర్ ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామ శివారులో జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కలెక్టర్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యాపీఠ వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి వేద మంత్రాలతో వారికి స్వాగతం పలికి ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం ఆశ్రమ ఆవరణంలో అంబలి కేంద్రాన్ని సందర్శించారు.

11న నిరుద్యోగ మార్చ్



మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సంగారెడ్డిలో ఈ నెల 11న నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దౌల్తాబాద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్, నవీన్, నిఖిల్ గౌడ్, రవి, చంద్ర గౌడ్, సతీష్ యాదవ్, మల్లారెడ్డి, వెంకట్, శ్రీకాంత్, కృష్ణ, ప్రవీణ్ గౌడ్, బాలేష్ యాదవ్, మణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 11న నిరుద్యోగ మార్చ్‌లో నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పాల్గొనాలని కోరారు.

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి



మాట్లాడుతున్న పట్లోళ్ల సంగమేశ్వర్

సంగారెడ్డి టౌన్: లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..హైదరాబాద్‌లో జూన్ 4న నిర్వహించే వీరశైవ లింగాయత్ మహా ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. లింగాయత్‌ల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్, కార్యవర్గ సభ్యులు గోవురాజు, ధనుంజయ్, అమరనాథ్, భరతప్ప, శరణ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలో పెరిగిన అప్పు'

సదాశివపేట(సంగారెడ్డి): ప్రధాని మోదీ పాలనలో దేశం అప్పు పెరిగిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాశ్‌రావు అన్నారు. సీపీఐ చైతన్యయాత్ర ముగింపు సందర్భంగా శనివారం పట్టణంలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ, అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నాడని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు రాలేదని, కొత్త పరిశ్రమల స్థాపన లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు జలాల్, తాజోద్దీన్, రహమాన్, షఫీ, పట్టణ కార్యదర్శి వినోద, ఏఐటీయూసీ మండల నాయకుడు శంకరప్ప, సునీత, మహిళ సమాఖ్య నాయకురాలు ఆర్.లక్ష్మి, పట్టణ నాయకులు సాదక్‌అలీ, పూలమ్మ, బుజ్జమ్మ, రత్నం, చింతా గంగయ్య, రమేష్ పాల్గొన్నారు.

పత్తి..పరేషాన్

- సీజన్ మొదట్లో క్వింటాల్‌కు రూ.9,100
- ప్రస్తుతం రూ.7,200

- రోజురోజుకు పడిపోతున్న ధర
- ఇంకా 40 శాతం నిల్వలు రైతుల వద్దే





ఈ చిత్రంలో కనిపిస్తున్న పత్తి కుప్ప వట్‌పల్లి మండలం నాగులపల్లికి చెందిన రైతు కేశన్నది. మంచి ధర వస్తుందనే ఆశతో పంటను చేనులో నిల్వ చేశాడు. డిసెంబర్‌లో క్వింటాల్‌కు రూ. 9,300 ఉండగా, ప్రస్తుతం రూ.7,200లకు పడిపోయింది. ఆరు నెలలు వేచి ఉన్నా ఆశించిన ధర రాక, కూలీల ఖర్చు కోసం చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మరో వైపు అకాల వర్షాలు కురుస్తుండటంతో తేమకు గింజలు మొలకెత్తే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నాడు.



వట్‌పల్లిలోని ఓ జిన్నింగ్ మిల్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పత్తికి మంచి ధర వస్తుందని వేచి చూసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ధర పెరుగుతుందనే ఆశతో ఆరు నెలలుగా నిల్వ చేసుకున్నా ఆశించిన ప్రయోజనం దక్కడంలేదు. రోజురోజుకు ధర పడిపోతుండటంతో పత్తి రైతులు దిగాలు చెందుతున్నారు. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం గత వానాకాలం జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. సుమారు 60 శాతం మంది రైతులు గతంలోనే తమ పత్తి పంటను విక్రయించుకున్నారు. ధర పెరిగే అవకాశం ఉండడంతో సుమారు 40 శాతం మంది ఇళ్లు, చేనుల్లో ప్లాస్టిక్ కవర్లు కప్పి నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో పత్తి దెబ్బతినే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గుతున్న ధర

పత్తి ధర రోజురోజుకు పడిపోతోంది. డిసెంబర్‌లో క్వింటాల్‌కు రూ.9,500 ఉండగా, ప్రస్తుతం రూ.7,500లు పలుకుతోంది. పక్షం రోజుల క్రితం రూ.8,200లు ఉండగా, మరింత తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి గింజలు, ఎరువులతో పాటు, కూలీలకు ఖర్చుల కోసం చాలా మంది రైతులు అప్పులు తెచ్చారు. ధర పెరిగితే లాభాలకు విక్రయించవచ్చని భావించిన రైతులకు తగ్గిన పత్తి ధర నిరాశను మిగిలిచ్చింది. వడ్డీల భారం పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిన్నింగ్ మిల్లులతో పాటు, మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తున్నారు.

ఆరు నెలలుగా చూస్తున్నా



ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. ఫిబ్రవరిలో పత్తి తీయడం పూర్తయింది. క్వింటాలుకు రూ.10వేలు పెరుగుతుందని ఆశించి ఇంట్లో నిల్వ చేశా. ప్రస్తుతం రూ.7,500 అంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పత్తి దెబ్బతినే అవకాశం ఉంది. మరో వారం చూసి విక్రయిస్తా.

– జంజిరి మొగులయ్య, పీపడ్‌పల్లి, రాయికోడ్ మండలం

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి టౌన్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు ఆదేశించారు. శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించారు. అకాల వర్షాలతో ఇప్పటికే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని, చివరి గింజ వరకూ కొంటామని ధైర్యం చెప్పాలని అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కోతలు పూర్తయిన వెంటనే తేమ లేకుండా కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చేలా వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను చైతన్యపరచాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు, జిల్లాకు 1,550 కొత్త టార్పాలిన్లు వచ్చాయని, వాటిని అన్ని కేంద్రాలకు పంపాలని మార్కెటింగ్ అధికారికి సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లు పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలని, ఏఈఓలు అన్ని వేళలా అందుబాటులో ఉండి వారి పరిధిలో కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు ధాన్యం తేమ శాతం పరిశీలించాలన్నారు. తడిచిన ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని, హమాలీల కొరత ఉండకుండా చూసుకోవాలన్నారు. మిల్లర్లు ధాన్యం వచ్చిన వెంటనే దించుకోవాలని అన్నారు. ప్రతీ రోజు ట్యాబ్ ఎంట్రీ జరగాలని, ట్రక్ షీట్స్ రాయాలని స్పష్టం చేశారు. సివిల్ సప్లై డీఎస్‌ఓ, డీఎం అప్రమత్తంగా ఉండాలని, అన్ని రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాస రావు, డీఎస్‌ఓ వనజాత, సివిల్ సప్లై డీఎం సుగుణ బాయి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నరసింహా రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి, డీసీఓ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- 57మంది లబ్ధిదారులకు పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వెలిముల గ్రామంలో 40 ఏళ్లుగా ఉన్న భూ సమస్యను పరిష్కరించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం వెలిమెలలో సర్వే నంబర్ 434లో భూమికి సంబంధించిన 57 మంది లబ్ధిదారులకు పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్ రెడ్డితో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో రూ.1.63కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం భూసమస్యను పరిష్కరించిందని కొనియాడారు. అనంతరం రూ.9కోట్లతో వార్డుల అభివృద్ధి పనులను ప్రారంభించారు. బుడగ జంగాల కోరిక మేరకు రూ.20లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించి అందించామని పేర్కొన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత, వైస్ చైర్మన్ రాములు గౌడ్, తహసీల్దార్ జయరాం, కౌన్సిలర్‌లు రవీందర్ రెడ్డి, సుచరిత, లచ్చిరాం నాయక్, బాలాజీ, శంషాబాద్ రాజు, మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు కేంద్రాల నిర్వహణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: లక్ష్యం మేరకు జిల్లాలో ఆరోగ్య మహిళా, కంటి వెలుగు శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ శరత్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 36 క్లినిక్‌లు నిర్వహించి 2,489 మంది మహిళలకు పరీక్షలు చేశామన్నారు. 175 రిఫరల్ కేసులను గుర్తించి, 133 కేసులకు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 481 పంచాయతీలు, 168 మున్సిపల్ వార్డులలో శిబిరాలు నిర్వహించి 10,13,165 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 75,420 మందికి రీడింగ్ గ్లాసులు, 44,555 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అధికారులు అందజేసినట్లు వివరించారు. జిల్లాలో 159 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2,300 మెట్రిక్ టన్నులు సేకరించామని, మరో 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ జీఓ 59 కింద లబ్ధిదారులు నిర్దేశిత రుసుము చెల్లించేలా చూడాలని, రెండు రోజుల్లో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ పది రోజుల్లోగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు తరలించాలని కలెక్టర్లకు సూచించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గాయత్రీ దేవి, సివిల్ సప్లై అధికారులు సుగుణ బాయి, వనజాత, ఆర్డీఓ నగేష్ పాల్గొన్నారు.

వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ స్పష్టమైన ప్రకటన చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 29 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వర్గీకరణకు జాతీయ పార్టీలు మద్దతు ఇస్తున్నా బీఎస్పీ తన వైఖరి తెలపకపోవడం విడ్డూరమని అన్నారు. బహుజన సమాజ్ వాదీ పార్టీ చీఫ్ మాయావతి రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా వర్గీకరణకు మద్దతు ఇస్తూ ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాతంగి చిరంజీవి, గందగల్ల ప్రసాద్, పోతురాజు శివ కుమార్, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుచ్చేంద్ర

కేసులు, సెక్షన్లపై అవగాహన ఉండాలి



సమావేశానికి హాజరైన పీపీలు, పోలీసులు

సంగారెడ్డి టౌన్: బెయిల్ కౌంటర్లు, సెక్షన్లపై కోర్టు వ్యవహారాలు చూసే పోలీసులకు అవగాహన ఉండాలని ఉమ్మడి జిల్లా పీపీలు రంజిత రాథోడ్, విజయ్ శంకర్ రెడ్డి, కులకర్ణి అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసులకు అవగాహన కల్పించారు. నేరస్తులపై దాతలు వేసిన కేసులకు సంబంధించి సెక్షన్లు, బెయిల్ కౌంటర్లు ఎలా సిద్ధం చేయాలి, ఎన్‌డీపీఎస్ చట్టం, లిక్కర్ స్కాం కేసులపై వివరించారు. అనంతరం సెక్షన్ 498, సెక్షన్ 376 బీ, ఐ, పీ, సీపై రంజిత రాథోడ్, ఎస్సీ, ఎస్టీ చట్టంపై విజయ్ శంకర్ రెడ్డి, పోక్సో చట్టంపై కులకర్ణి వివరించారు. జిల్లా డీఎస్పీ, ఏసీపీలు, ఎస్ఐలు, కోర్టు లైజనింగ్ అధికారులు, కోర్టు డ్యూటీ పోలీసులు హాజరయ్యారు.

పెరిగిన పనిభారం

- రెగ్యులర్ ఉద్యోగులకు అదనపు బాధ్యతలు
- ఒక్కొక్కరికి నాలుగు పంచాయతీలు
- పని ఒత్తిడితో కార్యదర్శుల సతమతం



జోగిపేటలో సమ్మె చేస్తున్న కార్యదర్శులు

జోగిపేట(అందోల్): నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28వ తేదీ నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగిన విషయం విధితమే. ప్రతీ గ్రామంలో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలు, డంపింగ్ యార్డు, తడిపొడి చెత్తల సేకరణ, డీఎస్ఆర్ సిద్ధం చేయడం తదితర పనుల్లో జేపీఎస్‌లదే ప్రముఖ పాత్ర. గ్రామాల్లో జూనియర్ కార్యదర్శుల బాధ్యత ముఖ్యం కావడం, వారంతా సమ్మెకు దిగడంతో ప్రభుత్వం రెగ్యులర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలను అప్పగించింది. కాగా ఇప్పటికే ఉన్న పంచాయతీల పనులతో సతమతమవుతున్న కార్యదర్శులకు మిగతా జీపీల బాధ్యలు అప్పగించడంతో పనిభారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

- జిల్లాలో 647 గ్రామ పంచాయతీల్లో 208 మంది రెగ్యులర్ కార్యదర్శులు, 407 మంది జేపీఎస్‌లు ఉన్నారు.
- జేపీఎస్‌ల సమ్మెతో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు ఇతర పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో ఒక్కో కార్యదర్శి అదనంగా పనులు నిర్వహించాల్సి వస్తోంది.
- ఒక్క పంచాయతీతోనే తలమునకలయ్యే కార్యదర్శులకు ఈ భారం తలనొప్పిగా మారింది.
- మరోవైపు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పంచాయతీల పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలుండడంతో పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రతీ రోజు ఒక్కో కార్యదర్శి 3, 4 పంచాయతీల పరిధిలో పర్యటించి అక్కడి పనులను నిర్వర్తించాల్సి రావడంతో తీరికలేకుండా పోతోందని వాపోతున్నారు.
- పని ఒత్తిడితో ఉన్న పంచాయతీలకు న్యాయం చేయలేకపోతున్నామని, ప్రభుత్వం త్వరగా దీనిపై ఓ నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిసింది.
- సమస్య త్వరగా పరిష్కారం కాకపోతే రెగ్యులర్ కార్యదర్శులు కూడా ఆందోళనకు దిగే అవకాశం ఉంది.

ప్రభుత్వం స్పందించాలి



న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ సమ్మెకు దిగితే ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకపోవడం సరి కాదు. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల విధులు నిర్వర్తించినా పర్మినెంట్ చేయకపోవడం శోచనీయం. ప్రభుత్వం దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి

– వినీత్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి

ఒత్తిడి తగ్గించాలి



జూనియర్ కార్యదర్శుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాల్లో రెగ్యులర్ కార్యదర్శులకు పని భారం పెరిగింది. ప్రతీరోజు పనులు చూసుకుంటూ రిపోర్టులు పంపడం ఇబ్బందిగా మారింది.

– రమేశ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫిర్యాదు వస్తే సస్పెండ్

జేపీఎస్‌లు సమ్మెలో ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రెగ్యులర్ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించాం. కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి.

– సురేష్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర గురుకుల కళాశాలలో 2023–24 ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు నిర్వహించిన అర్హత పరీక్ష శనివారం ప్రశాతంగా ముగిసిందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో 2,434 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 414 మంది గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆటో చోరీ

పటాన్‌చెరుటౌన్: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటో చోరీ అయ్యింది. పటాన్‌చెరు ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం...పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రాజు తన ఆటోను ఏప్రిల్ 30వ తేదీన ఇంటి ముందు పార్కు చేశాడు. మే 1వ తేదీ ఉదయం 6 గంటలకు నిద్రలేచి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో ఆటో కోసం పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పార్కింగ్‌లో ఉన్న ఆటోను దొంగలు ఎత్తుకెళ్లారంటూ రాజు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని చిట్కుల్ గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడిపల్లి మండలం ధనూజతండాకు చెందిన నునావత్ గన్యా (50)తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించంగా, శనివారం మృతి చెందాడు. గన్యా తమ్ముడి కుమారుడు నునావత్ రెడ్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె ..



దుబ్బాక: విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన చుక్క నరేష్ పాడిగేదె శనివారం మేత మేస్తుండగా, విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.65 వేలు ఉంటుందని రైతు నరేష్ బోరున విలపించాడు.

పిడుగుపాటుకు పాడిగేదె ..


మద్దూరు(హుస్నాబాద్): పిడుగు పడి ఓ పాడిగేదె మృతి చెందింది. మండల పరిధిలోని లద్నూర్ గ్రామానికి చెందిన నంద నర్సింహస్వామి తన పాడిగేదెను శుక్రవారం రాత్రి వ్యవసాయబావి వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగు పడ్డాయి. శనివారం ఉదయం వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూడగా పిడుగు పడి పాడిగేదె మృతి చెంది.రూ.70వేల విలువగల పాడిగేదె మృతి చెందడంతో రైతు రోదిస్తున్నాడు.

ఎగిరిపడుతున్న రాళ్లు

బ్లాస్టింగ్ జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయానికి సమీపంలోని దాసారం గుట్టలో బ్లాస్టింగ్ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నివాస ప్రాంతానికి సమీపంలో ఉండడంతో ఇళ్లు, షాపులు, పెట్రోల్ బంక్‌పై రాళ్లు పడుతూనే ఉన్నాయి. కొందరు రియల్ వ్యాపారులు గుట్టను తొలిచి ప్లాట్లు చేస్తుండడంతోనే అధికారులు చడీచప్పుడు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శనివారం కూడా ఇదే గుట్టపై బ్లాస్టింగ్ చేయగా, పక్కనే ఉన్న చికిన్ షాప్‌లోకి సుమారు 5 కిలోల రాయి దూసుకొచ్చింది. ఆ సమయంలో చికెన్ షాప్ మూసి ఉండడంతో ప్రమాదం తప్పింది. దాసారంగుట్టపై కొందరు రియల్టర్లు బ్లాస్టింగ్ చేస్తున్నట్టు కొంతమంది ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్ తెలిపారు. విచారణ చేపట్టిన బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.





బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో చికెన్ సెంటర్‌లోకి దూసుకొచ్చిన రాయి (ఇన్‌సెట్‌లో) బ్లాస్టింగ్ జరిగింది ఈ దాసారం గుట్టలోనే

నన్ను దేవుడే కాపాడిండు



ప్రతిరోజు ఉదయం వచ్చి సాయంత్రం వరకు చికెన్ విక్రయిస్తాను. కానీ ఈరోజు ఆ దేవుడి దయతో షాప్ తీయలేదు. షాప్ మూసిన సమయంలో దాసారం గుట్టపై బ్లాస్టింగ్ చేస్తున్నప్పుడు 5 కిలోల రాయి నా షాప్‌లోకి దూసుకు వచ్చింది. –ఫయాజ్, చికెన్‌సెంటర్ నిర్వాహకుడు

ప్రమాదవశాత్తు కుంటలో పడి...

నిజాంపేట(మెదక్): ప్రమాదవశాత్తు కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన అంబటి రాజాగౌడ్(25) శుక్రవారం మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం గ్రామశివారులోని తుమ్మల కుంటలో శవమై తేలాడు. ఉదయం అటుగా వెళుతున్న గ్రామస్తులు నీటిపై తేలుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజాగౌడ్(ఫైల్)

ఐక్యతతో మరింత అభివృద్ధి సాధించాలి

మంత్రి హరీశ్‌రావు



బంజరుపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: బంజరుపల్లి గ్రామప్రజల ఐక్యతతో ఎంతో అభివృద్ధి చెందింది...ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల పరిధిలోని బంజరుపల్లిలో గ్రామ మహంకాళి-మాతమ్మ వార్షికోత్సవం, పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవం, రూరల్ మండల పరిధిలోని శంకర్‌నగర్‌లో జరుగుతున్న పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణమహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ బంజరుపల్లి ఊరంతా ఈ ఉత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదన్నారు. బంజరుపల్లిపై ఉన్న ప్రేమతో సీఎం కేసీఆర్ సమావేశం ఉన్నా.. మీ సంతోషం, ఆనందంలో మీతోపాటు భాగస్వామ్యం కావాలన్న కోరికతో మీ వద్దకు వచ్చానన్నారు. రూరల్ మండలంలోని శంకర్ నగర్‌లో పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, ఎల్లవ్వ, ఉపసర్పంచ్ శంకర్, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం మాయం

ఆందోళనకు దిగిన 28 మంది దళితులపై కేసు నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): వివాదాస్పద స్థలంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే మాయం చేశారు. వివరాల్లోకి వెళితే..మిరుదొడ్డి మండలం ధర్మారంలోని ఓ స్థలంపై దళితులు, అదే గ్రామానికి చెందిన కొందరు అగ్రవర్ణాల మధ్య వివాదం నెలకొంది. ఆ స్థలం మాదేనంటూ ఏడాది క్రితం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అగ్రవర్ణాల వారు అభ్యంతరం చెప్పగా ఇరువర్గాల సమస్య రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి వెళ్లింది. సమస్య పరిష్కారమయ్యే వరకు ఎవరూ ఆ స్థలంలో అడుగు పెట్టరాదని ఇరు వర్గాల వారిని ఆదేశించారు. ఇటీవల అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేయడానికి దళితులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. అయినా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య స్థలంపై మరింత వివాదం రాజుకుంది శుక్రవారంరాత్రి గుర్తు తెలియనివారు అంబేడ్కర్ విగ్రహాన్ని మాయం చేశారు. శనివారం తెల్లవారుజామున విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు ధర్మారం చేరుకున్నారు. సిద్దిపేట- మెదక్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దుబ్బాక సీఐ కృష్ణ, మిరుదొడ్డి, భూంపల్లి ఎస్‌ఐలు గంగాధర్‌గౌడ్, గంగరాజులు పోలీసు సిబ్బందితో ఆందోళన వద్దకు చేరుకున్నారు. దళితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విగ్రహాన్ని మాయం చేసిన వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని దళితులు ఆందోళనమరింత తీవ్రతరం చేశారు. దీంతో దళిత సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్మారం ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్‌తో పాటు ఆందోళనకు దిగిన 28 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపారు. అందులో 10 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసి, మిగిలిన వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కేసులు పెట్టడం సరికాదని ధర్మారం ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్, డీఎస్‌పీ (దళిత శక్తి ప్రోగ్రాం) నాయకులు చందు మహరాజ్, లక్ష్మణ్ మహరాజ్, మొగిళి భిక్షపతిలు మండిపడ్డారు. అంబేడ్కర్ విగ్రహాన్ని మాయం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చలో ధర్మారం కార్యక్రమం చేపడతామని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు.



మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన దళిత సంఘాల నాయకులు

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు డివిజన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు.

తండ్రి కనిపించడం లేదని...

పటాన్‌చెరు టౌన్: తండ్రి అదృశ్యంపై ఓ కుమారుడు ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన నర్సింలు కుటుంబసభ్యులతో కలిసి మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి వచ్చి కూలి పనులు చేస్తూ సాగిస్తున్నారు. ఈనెల 3వ తేదీన నర్సింలు కుటుంబసభ్యులతో కలిసి పనికి వెళ్లగా, ఇంటి వద్ద ఉన్న తండ్రి పాపన్న బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తండ్రి కనిపించలేదు. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తన తండ్రికి కల్లు తాగే అలవాటు ఉందని, బయటకు వెళ్లి ఇల్లు తెలియక తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పాపన్న



నాగేశ్వర్‌రావు (ఫైల్)

సొంతూరికి వెళుతున్నానని...

స్వగ్రామానికి వెళుతున్నానని చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అమీన్‌పూర్ ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలుకు చెందిన నాగేశ్వరరావు బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురం కాలనీకి వచ్చాడు. స్థానికంగా సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ 30వ తేదీన బైక్‌పై కర్నూలు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరిన నాగేశ్వరరావు ఆచూకీ తెలియలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కర్నూలులో వెతికినా ఏ వివరాలు తెలియలేదు. దీంతో తన తండ్రి కనిపంచడం లేదంటూ నాగేశ్వరరావు కుమారుడు సతీష్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లి పెళ్లి అప్పు తీర్చేందుకు చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెల్లి పెళ్లికి చేసిన అప్పులు తీర్చేందుకు ఓ కార్పెంటర్ చోరీకి పాల్పడి పోలీసులకు అడ్డంగా దొరికాడు. ఆ వివరాలను విలేకరులకు శనివారం మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. రామచంద్రాపురం పట్టణంలోని ఎస్‌బీఎస్‌బీ అవతార్‌లో నివాసం ఉండే విష్ణుతేజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత నెల 26వతేదీన కుటుంబ సభ్యులతో కలసి సంగారెడ్డి వెళ్లాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి కిటికీ గ్రిల్ తీసి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా పడక గది తాళం పగులగొట్టి ఉంది. అందులో రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, , 2 విలువైన చేతి గడియారాలు, రూ.15వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రతాపలింగం, ఎస్‌ఐ నర్సింహులు వారి బృందంతో విచారణ మొదలు పెట్టారు. చోరీ చేసిన తీరును పరిశీలించి కార్పెంటర్ అయి ఉండవచ్చని అనుమానించారు. ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్పెంటర్‌ల వివరాల సేకరించారు. బాధితుడి పక్క ఫ్లాట్‌లో పనిచేస్తున్న హైదరాబాద్‌లోని కాప్రాలో నివాసం ఉండే బీహార్‌కు చెందిన కార్పెంటర్ రాకేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. తన చెల్లి పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చడం కోసం ఈ చోరీ చేసినట్లు చెప్పాడు. అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, చేతి గడియారాలు, రూ.13,700 నగదు, ఒక డ్రిల్లింగ్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. తర్వాగా కేసు ఛేదించిన అధికారులను ఆమె అభినందించారు. క్రైం సిబ్బంది గోపికృష్ణారెడ్డి, నారాయణ, ప్రకాష్, మహేందర్, సిద్ధులకు రివార్డులు అందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

భర్తతో గొడవపడి భార్య బలవన్మరణం

పటాన్‌చెరు టౌన్: భర్తతో గొడవపడి ఓ భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్‌ఐ ప్రసాదరావు కథనం ప్రకారం...కంది మండలానికి చెందిన మంజుల(35) వివాహం 2006లో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన రాములతో జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరునెలల నుంచి మంజుల కంది సమీపంలోని ఒక ప్రైవేట్ క్యాంటీన్‌లో ఉద్యోగం చేస్తూ, మద్యానికి బానిస అయ్యింది. ఈ క్రమంలో మే 5వతేదీన మంజుల తాగి వచ్చి ఇంట్లో పిల్లలను కొడుతుతుండగా, భర్త మందలించాడు. దీంతో మద్యం మత్తులోనే భర్తతో గొడవపడి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మంజుల చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. భర్త రాములు స్థానికుల సహకారంతో తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి భార్యను చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆపై పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మంజుల మృతదేహం

యాసిడ్ దాడి అంటూ కలకలం

నారాయణఖేడ్: పట్టణంలో యాసిడ్ దాడి ఘటన కలకలం సృష్టించింది. నారాయణఖేడ్ శివారులోని ఓ ప్రైవేట్ పాలడెయిరీలో పనిచేస్తున్న యువకుడిపై యాసిడ్ పడి గాయాలయ్యాయి. అయితే ఆ డెయిరీలోనే పనిచేస్తున్న మరో యువకుడి గొడవపడి యాసిడ్ చల్లాడని వందులు వచ్చాయి. బాధితుడిని ఖేడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్థానికులు చేర్పించారు. తనపై ఎవరూ యాసిడ్ దాడి చేయలేదని బాధితుడు తెలిపారు. యాసిడ్ బాటిల్ తెస్తుండగా అనుకోకుండా తనపై పడిందన్నాడు. ఈ విషయమై ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా, యాసిడ్ దాడికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యపై ఏసీపీ విచారణ

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పొట్లపల్లికి చెందిన వృద్ధుడు వెంకటయ్య ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనపై ఏసీపీ సతీష్ శనివారం విచారణ జరిపారు. సంఘటన స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వెంకటయ్య కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎప్పుడూఇలాంటి సంఘటనలు పునరావృతం కావొద్దన్నారు. ఏసీపీ వెంట సీఐ ఎర్రల కిరణ్, ఎస్‌ఐ మహేశ్ ఉన్నారు.



వెంకటయ్య ఆత్మహత్య చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్

ఇద్దరి మృతి.. నలుగురికి గాయాలు

ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల ప్రమాదాలు

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ

చేగుంట(తూప్రాన్): ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. హవేళీ ఘనపూర్ మండలం ఫరీద్‌నూర్‌కు చెందిన పండ్ల కృష్ణ(38) అత్తగారి గ్రామమైన పోతాన్‌పల్లిలో జరుగుతున్న పెద్దమ్మ జాతర ఉత్సవాలకు శనివారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. రెండు నిమిషాలైతే పోతాన్‌పల్లికి చేరుకునేవాడు. అంతలోనే చందాయిపేట మూలమలుపువద్ద ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కృష్ణ మృతదేహం

రైతుకు తీవ్రగాయాలు

కొడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన రైతు నాగేష్‌గౌడ్ తన వరిధాన్యాన్ని శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంవద్ద ఆరబెట్టాడు. శుక్రవారం రాత్రి వర్షం వచ్చే సూచన ఉండటంతో ధాన్యం కుప్ప చేసి వాటిపై టార్పాలిన్ కప్పి ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. కొడిపల్లికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై అటుగా వెళుతూ నాగేష్‌గౌడ్‌ను ఢీకొట్టాడు. దీంతో నాగేష్‌గౌడ్ రెండు కాళ్లు విరగ్గా, తలకు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడి వెంటనే నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని

కొండపాక(గజ్వేల్): మొక్కలకు నీరు పెడుతుండగా, లారీ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి శామీర్‌పేట వరకు రాజీవ్‌రహదారి డివైడర్ మధ్యలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పనుల నిర్వాహకులు మొక్కలు నాటారు. ఈక్రమంలోనే శనివారం కొమురవెల్లి కమాన్ సమీపంలో డివైడర్‌పై మొక్కలకు ట్యాంకర్ ద్వారా మల్లయ్య నీరు పెడుతున్నాడు. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో మల్లయ్యకు గాయాలు కాగా, వాటర్ ట్యాంకరు స్వల్పంగా దెబ్బతిన్నది. మల్లయ్యను టోల్ ప్లాజా అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు.

రెండు ఆటోలు ఢీ

వెల్దుర్తి(తూప్రాన్): ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండల పరిధిలోని మానేపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రశాంత్ తన తల్లి పద్మతో కలిసి శనివారం ఆటోలో వెల్దుర్తికి వచ్చాడు. సంతలో కూరగాయలు తీసుకుని ఆటోలో గ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. అదే సమయంలో వెల్దుర్తి వైన్స్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనతో ఆటోలో ఉన్న ప్రశాంత్ కింద పడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని..

వర్గల్(గజ్వేల్): బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మీనాజీపేటకు చెందిన సయ్యద్ చాంద్‌పాష(50) దినసరి కూలీ. శనివారం రాత్రి చాంద్‌పాష తన పని పూర్తిచేసుకుని అంబర్‌పేట వైపు నుంచి నడుచుకుంటూ మీనాజీపేట ఇంటికి వస్తున్నాడు. శేరిపల్లికి చెందిన జిన్న నర్సింలు అదే మార్గంలో బైక్ మీద వస్తూ చాంద్‌పాషను వెను నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో చాంద్‌పాష అక్కడికక్కడే దుర్మరణం చెందగా, నర్సింలుకు తీవ్రగాయాలయ్యాయి. చాంద్‌పాష మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడిన నర్సింలును కూడా ఆస్పత్రికి తరలించారు.



చాంద్‌పాష (ఫైల్)

లాటరీ వచ్చిందంటూ...

నమ్మి రూ.1,78,750 పంపి మోసపోయిన బాధితుడు

సిద్దిపేటకమాన్: లాటరీ వచ్చిందని గుర్తు తెలియనివ్యక్తి చేసిన ఓ ఫోన్‌కాల్‌కు స్పందించి ఆన్‌లైన్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు పంపి ఒకరు మోసపోయారు. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒకరికి అపరిచిత వ్యక్తి కాల్ వచ్చింది. మీషో నుంచి అంటూ మాటలు కలిపాడు. మీకు రూ.12లక్షల లాటరీ వచ్చిందని ఆ డబ్బు మీ ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం చెల్లించాలన్నాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబరుకు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా రూ.1,78,750 పంపించాడు. ఆ తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్టు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు1930కు ఫిర్యాదు చేశాడు.

ధని లోన్‌యాప్‌తో సైబర్ మోసం

సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని ఒకరు ధని లోన్‌యాప్ లింకు పంపించాడు. అతడు సూచించిన విధంగా బాధితుడు తన వివరాలు ఆ యాప్‌లో నమోదు చేశాడు. త్వరలో లోన్ డబ్బు శాంక్షన్ అవుతుందని ముందుగా ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం పంపించాలని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబరుకు ఆన్‌లైన్‌లో రూ.18,499 పంపించి మోసపోయాడు.

నౌకరీ.కం పేరుతో

రాయపోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో నౌకరీ.కం యాప్‌లో తన వివరాలు నమోదు చేశాడు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్లాక్ మెయిల్ చేయడంతో బాధితుడు భయపడ్డాడు. అతను సూచించిన ఫోన్‌నంబరుకు రూ.8,950 పంపించి సైబర్ మోసానికి గురయ్యాడు.



సౌండ్ బాక్స్‌లు డెలివరీ అంటూ..

భూంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా ఆన్‌లైన్‌లో సౌండ్ బాక్స్‌లు ఆర్డర్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి సౌండ్ బాక్స్‌లు డెలివరీ చేయాలంటే అడ్వాన్స్ డబ్బు చెల్లించాలని నమ్మించాడు. దీంతో బాధితుడు సైబర్ నేరగాడు సూచించిన నంబరుకు రూ.18,800 పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్టు గుర్తించి ఫిర్యాదు చేశాడు.

ఒక నంబరుకు బదులు మరో నంబరుకు డబ్బు పంపి..

అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి తన స్నేహితుడి ఫోన్ నంబరుకు డబ్బు పంపించబోయి వేరే నంబరుకు ఆన్‌లైన్‌లో రూ.9,800 పంపించి మోసపోయాడు. ఈ ఘటనపై బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రూ.9,800 ఫ్రీజ్ చేశారు.

పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ఉందంటూ...

పటాన్‌చెరుటౌన్: పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ఉందంటూ ఇద్దరు ఓ ప్రైవేట్ ఉద్యోగులను సైబర్ నేరగాళ్లు చీట్ చేశారు. టాస్క్‌ల పేరిట ఆ ఇద్దరి నుంచి రూ.2.79 లక్షలు లాగేశారు. చివరకు డబ్బు ప్రస్తావన వచ్చేసరికి వారి నుంచి ఏ రెస్పాన్స్ రాలేదు. దీంతో తాము మోసపోయామంటూ ఆ ప్రైవేట్ ఉద్యోగులు సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

◆ బీరంగూడకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఏప్రిల్ 27వ తేదీన పార్ట్ టైం జాబ్‌ఆఫర్ అంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేస్తూ వస్తున్నాడు. చివరికి తాను పెట్టిన రూ1.50లక్షలకు రెట్టింపు నగదు ఇవ్వాలని అడగ్గా, అవతలి వ్యక్తి నుంచి స్పందన రాలేదు.

◆ అమీన్‌పూర్‌కు చెందిన మరో ఉద్యోగికి ఏప్రిల్ 3వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తాను వివరాలను నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్క్‌లు చేస్తూ వచ్చాడు. చివరకు తాను పెట్టిన రూ.1.29 లక్షలకు రెట్టింపు ఇవ్వాలని అడగ్గా అవతలి నుంచి స్పందన లేదు.